క్లుప్తంగా

ఎంఎస్ఎంఈలపై వర్క్‌షాప్



తెనాలి: భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. ఎంఎస్ఎంఈలుగా పిలుచుకునే ఈ పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా 'రైజింగ్ అండ్ యాక్సెలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మార్మెన్స్' అనే పేరుతో పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో ఉద్యమ రిజిస్ట్రేషను కీలకం. దీనిపై అవగాహన కల్పించేందుకు సోమ వారం పట్టణ చెంచుపేటలోని కమ్యూనిటీ హాలులో వర్క్‌షాపును నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, చెంచుపేట బ్రాంచి మేనేజరు ధనావతు కిషన్‌లు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలు ఎందుకు? ఎవరు ఏర్పాటుచేయాలి? రిజిస్ట్రేషన్ ఆవశ్యకత ఏమిటి? ప్రభుత్వం నుంచి లభించే సౌకర్యాలు ఏమిటనే అంశాలపై అవగాహన కల్పించారు.

పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు



తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను తెలుసుకుని నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని వారికి చెప్పారు. సమావేశంలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి అయిదు, మున్సిపాలిటీ పరిధిలోనివి అయిదు, పోలీసుశాఖ పరిధిలో మూడు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అర్జీలు ఒక్కోటి చొప్పున మొత్తం 15 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కర్రసాము శిక్షణ



తెనాలి: పట్టణంలోని హరి హంసిక డాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్ 37వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఇన్‌స్టిట్యూట్ మాస్టర్ ఎం.చిన్న విద్యార్థులకు ప్రాచీన యుద్ధ కళ కర్రసామును ప్రత్యేకంగా పరిచయం చేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ కర్రసాము సంభయ్య మాస్టారు, విద్యార్థులకు కర్రసాముపై ఒక ప్రత్యేక శిక్షణా సెషన్‌ను నిర్వహించారు. కర్రసాము అనే ఈ ప్రాచీన యుద్ధకళ అంతరించిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో మాస్టర్ ఎం.చిన్న తనను ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందని సంభయ్య అన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లోని పిల్లలు క్రమశిక్షణతో నేర్చుకుంటున్న తీరు ప్రశంసనీయమని చెబుతూ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. స్వీయరక్షణ కోసం కర్రసాము ఎంతో ఉపయోగకరమని మాస్టర్ ఎం.చిన్న చెప్పారు. శిక్షణ అందించిన డాక్టర్ కర్రసాము సంభయ్యకు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

మద్యానికి బానిసైన పండ్ల వ్యాపారి

తాడేపల్లిరూరల్: పొట్టకూటి కోసం వలస వచ్చిన ఓ పండ్ల వ్యాపారి మద్యానికి బానిసై అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై తాడేపల్లి పోలీసులు సోమవారం కేసునమోదు చేశారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన వెంకన్న (45) జీవనోపాధి కోసం విజయవాడ వచ్చి సాంబమూర్తిరోడ్‌లోని బావాజీపేట 1వ లైన్‌లో నివసిస్తున్నాడు. అతను పండ్ల వ్యాపారి. వెంకన్న మద్యానికి బానిసై అందినచోట అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి రావడంతో అప్పులు తీర్చలేక తాడేపల్లి రూరల్ కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై పోలీసుల సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

- అక్రమ విద్యుత్ వాడకం గుర్తించి రూ.3.52 లక్షలు అపరాధ రుసుం విధింపు
- విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్.వెంకటేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు

తెనాలిటౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్.వెంకటేశ్వర రావు హెచ్చరించారు. సోమవారం తెనాలిలోని డి–2 సెక్షన్ పరిధిలో విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. జగ్గడిగుంటపాలెం, మల్లెపాడు, పెదరావూరు, సుల్తానాబాద్, కె–జోన్, ఎం–జోన్, ఎల్–జోన్ ప్రాంతాల్లో పర్యటించి తనిఖీ చేశారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. అనుమతించిన క్యాటగిరి ద్వారా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న వారిని గుర్తించి జరిమానా విధించారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 42 మందికి రూ. 3.14 లక్షలు జరిమానా విధించారు. మొత్తం రూ.3.52లు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు.

వినియోగదారుల ప్రేమిసెస్‌లో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పని సరిగా సీల్ ఉండాలని, ఒకవేళ లేకపోయినా, తుప్పుపట్టి ఊడిపోయినా వెంటనే సంబంధింత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. విద్యుత్ అధికారుల తనిఖీల్లో సీల్ లేకపోవడం, ఉద్దేశ పూర్వకంగా వాటిని తొలగించడం, గాట్లు పెట్టడం వంటివి గుర్తిస్తే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. విద్యుత్ చట్టం 135 ప్రకారం పనిచేయని మీటర్ల నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండవలసిన మీటర్‌కు బదులు వేరే మీటరు పెట్టి సీల్ లేకపోయిన విద్యుత్ చౌర్యంగా నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. మొదటి తప్పిదానికి అపరాధ రుసుము చెల్లించినచో కేసు నుంచి విడిచిపెడతామాని, రెండోసారి పట్టుబడితే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. అపరాధ రుసుం కట్టలేని పరిస్థితిలో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు. మొదటి తప్పిదానికి మూడు రేట్లు, రెండో తప్పిదానికి ఆరు రేట్లు జరిమానా విధించే అవకాశం విద్యుత్ చట్టంలో ఉన్నట్లు వివరించారు. విద్యుత్ చౌర్యంపై ఏదైనా ఫిర్యాదులను 94408 12263, 94408 12361 నెంబర్‌లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి.చిరంజీవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు బోరుగడ్డ ఆశోక్‌కుమార్, కె.రవికుమార్, ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఎఈలు ఎస్.వెంకట్రావు, కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, పలువురు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోండి

మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి

కొల్లిపర: రైతులందరూ ఈ పంటను నమోదు చేయించుకోవాలని, ఈనెల 30 వరకు మాత్రమే ఈ పంట నమోదు వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తారని, ఈ సమయాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో మాట్లాడుతూ అధికంగా యూరియా వాడటం వల్ల నష్టాలను గురించి తెలియచేశారు. రైతులందరూ కావలసినంత యూరియాని మాత్రమే కొనుగోలు చేయాలని ఎక్కువ మోతాదులో యూరియాను కొనుగోలు చేసి, నిల్వ చేసినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే పలు గ్రామాల్లో యూరియా నిలువలపై తనిఖీలు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా యూరియా నిల్వలు ఉన్నాయని గ్రహిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ప్రజలు అందించాలని కోరారు. మండలంలో తగినంత యూరియా అందుబాటులో ఉందనీ ఎవరు భయాందోళన చెందవలసిన అవసరం లేదని తెలియ చేశారు. అలాగే పంటలో పైపాటుగా యూరియా బదులు నానో యూరియా, డీఏపీ వాడకం, మరియు నత్రజని భాస్వరం పొటాష్‌కి బదులుగా జీవన ఎరువులు అయినటువంటి పీఎస్‌బీ, కెఎస్‌బీ ఎరువులు వాడాలని వివరించారు. అధిక వర్షం కారణంగా అరటి, పసుపు, కూరగాయలు మరియు వారిలో పంటలలో నీరు నిల్వ ఉన్నట్లయితే అధికమైన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలి

కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్



విద్యార్థులతో ఏర్పాటు చేసిన నూతన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కంపెనీ

తెనాలిరూరల్: విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదరావూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కంపెనీని సోమవారం ప్రారంభించారు. ముఖ్యతిథిగా పాల్గొన్న కల్నల్ ఉదయ్ కుమార్ విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విధివిధానాల గురించి వివరించారు. ఈ సందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకులు బ్రిడెన్‌పాల్ చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్కౌట్స్ యూనిఫామ్ బహుకరించారు. నూతనంగా చేరిన విద్యార్థులతో ఆరంభ వేడుక నిర్వహించి ప్రమాణం చేయించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవాభావం పొందించడానికి స్కౌట్ అండ్ గైడ్ ఉద్యమం ఎంతగానో ఉపయోగపడుతుందని కల్నల్ ఉదయ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ, సుబేదార్‌లు గురుదీప్‌కుమార్, సురేంద్రసింగ్, హవల్దార్‌లు సోహన్ కుమార్, నాగరాజు, కె.ఎస్.రెడ్డి, ఎస్.రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా మంగమూరి



చైర్మన్ హరిప్రసాదరావుతో ఎమ్మెల్సీ ఆలపాటి, ఇతర పాలకవర్గ బాధ్యులు

తెనాలి: పట్టణంలోని నెం.22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు సోమవారం సమావేశమై బ్యాంక్ అధ్యక్షుడిగా మంగమూరి హరిప్రసాదరావు, వైస్‌చైర్మన్‌గా అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కోట పున్నారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కుర్రా వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా బీఎల్ రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. డైరెక్టర్లుగా షేక్ జిలాని, కనగాల శ్రీనివాసరావు, తోట చంద్రశేఖర్, గడ్డిపాటి నాగయ్య, బచ్చు శ్రీనివాస్, కన్నెగంటి శ్రీనివాసరావు, కందేపు హరిప్రసాదరావు, దొప్పలపూడి శ్యాంసన్‌లు ఎన్నికయినట్టు తెలిపారు. అనంతరం కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో ప్రమాణస్వీకారోత్సవం చేశారు. బ్యాంకు అభివృద్ధికి, నూతన శాఖల ప్రారంభానికి కృషిచేస్తామని నూతన పాలకవర్గ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు వెల్లడించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో కూటమి పార్టీల నాయకులు హరిదాసు గౌరీశంకర్, కటారి వాసుదేవ నాయుడు, మహమ్మద్ ఖుద్దూస్, కరణం వెంకటేశ్వరరావు, వంగా సాంబిరెడ్డి, పెండేల వెంకట్రావు, గణేష్ యూత్ వీరవల్లి మురళి, తోటకూర వెంకట రమణారావు, ఎండీ ఇస్మాయిల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి బ్యాంక్ కార్యదర్శి కేవీవీ అమరనాథ్, బ్యాంకు సిబ్బంది స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తెనాలిరూరల్: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు పై కూటమి ప్రభుత్వం దాటవేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం తెనాలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ తెనాలి జోన్ కన్వీనర్ పుట్టా జనార్దనరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ చాన్‌బాషా మాట్లాడుతూ కూటమి మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటోందని, ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి, పెండింగ్ ఉన్న నాలుగు డీఏలలో రెండు విడుదల చేసినప్పుడు ఖచ్చితంగా ఇది మంచి ప్రభుత్వం అవుతుందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. టి.ఏసుబాబు, సి.హెచ్ లక్ష్మణ కుమార్, నరసింహారావు, పి. శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ప్రసాదరావు, శేఖర్, పూర్ణచంద్రరావు, సాంబశివరావు, శివనాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామికి పంచామృతాలతో తిరుమంజనం (అభిషేకం), సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, 6.30 గంటలకు శ్రీ కృష్ణ అవతార వైభవం, అష్టోత్తర శతనామార్చన, క్షీర తర్పణం, నివేదన, మంగళా శాసనములు నిర్వహించామని తెలిపారు. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యార్డు మాజీ డైరెక్టర్ శివన్నారాయణ మృతి తీరని లోటు

తెనాలిటౌన్: తాపీ మేస్త్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మాదల శివన్నారాయణ అకాల మరణం పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో సోమవారం యార్డు మాజీ డైరెక్టర్ శివన్నారాయణ, భౌతికకాయాన్ని అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి ఘననివాళులర్పించారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. శివన్నారాయణ అకాల మృతి తనను ఎంతగానో కలచివేసిందని అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. శివన్నారాయణ భౌతికకాయాన్ని సందర్శించి అంతిమయాత్రలో పాల్గొన్న వారిలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఎంపీటీసీ మైలా భాను, మాజీ ఎంపీటీసీలు సంకురు బుజ్జిబాబు, తాడిబోయిన శంకరరావు, చావలి ఆశోక్‌యాదవ్, డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, మేకల శివరామయ్య, పలువురు గ్రామపెద్దలు, పార్టీ నాయకులు ఉన్నారు.

కాల్వలు, రోడ్ల నిర్మాణాలు చేయండి



ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న మహిళ

తెనాలిఅర్బన్: 28వ వార్డులో మురుగు కాల్వలు, 3వ వార్డులో కొత్త సీసీ రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 16వ వార్డులో వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంటుందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, పెన్షన్ మంజూరు చేయాలని, తదితర అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబు, ఏసీపీ వాణి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దాసకుటిలో శ్రీరాముడి ధనుర్బాణాలు



దాసకుటిలో శ్రీరాముడి దనస్సు, పక్కన సీతారామదాసస్వామి, చిదంబరశాస్త్రి ,చల్లా శ్రీనివాస్

తెనాలి: అయోధ్యలో శ్రీరామచంద్ర మూర్తి వంశీకులచే కళ్యాణ రామమందిర నిర్మాణం జరుగుతున్న సందర్భంగా చేయించిన శ్రీరాముడి ధనుర్బాణాలు, పాదుకలను సోమవారం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని దాసకుటి ఆశ్రమంలో భక్తులు దర్శించుకున్నారు. ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసు స్వామి వారి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన షష్ఠమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. చివరిరోజైన సోమవారం మహాలక్ష్మీ అమ్మవారికి 16 కలశాలతో అభిషేకం, పూర్ణాహుతి ఎంతో విశేషంగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణరామ మందిరం, 108 అడుగుల శ్రీరాముని విగ్రహం నిర్మాణంలో భాగంగా చేయించిన శ్రీరాముడి ధనుర్బాణం, పాదుకలు దేశంలోని పుణ్యక్షేత్రాల యాత్రలో భాగంగా సోమవారం దాసకుటికి చేరుకున్నారు. అయోధ్యలో నిత్య అన్నదానం చేస్తున్న చల్లా శ్రీనివాస్ వీటిని తీసుకొని వచ్చారు. ఆశ్రమంలో కొన్ని గంటలపాటు ఉంచిన కోదండాన్ని భక్తులు భక్తిప్రపత్తులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిదంబరశాస్త్రి, చల్లా శ్రీనివాస్‌లు ఆ వివరాలను భక్తులకు తెలియజేశారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపులో చోరీ జరిగిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం నగర పరిధిలోని బ్యాంక్ కాలనీ నివాసితుడు నన్నపునేని సురేష్ తన ఇంటి కింద ఫ్లోర్‌లో విద్య ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తున్నాడు. యథావిధిగా 13వ తేదీ రాత్రి 10 గంటలకు షాపునకు తాళాలు వేసి పైన ఉన్న తన ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయాన్నే బయటకు వచ్చి చూడగా షాపు పక్కనే ఉన్న గోడపై వైర్ కాయిల్ బండిల్ పడి ఉండటం గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులను తీసుకుని కింద షాపువద్దకు వచ్చి చూడగా గోడకు సైడ్‌గా ఉన్న డోర్ గడియ పగలకొట్టి ఉంది. దాని నుంచి లోపలకు వెళ్లి పరిశీలించగా 8 కొత్త వైరు బాక్సులు, నాలుగు వైరు లూజ్ పెట్టెలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు.

గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి

షాపులో సీసీ కెమెరాలను చూడగా 14వ తేదీ అర్ధరాత్రి సుమారు 1.50 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు డోర్ గడియ పగలకొట్టి లోపలకు వచ్చి షాపులో వున్న వైరుబాక్సులను అపహరించుకోవడం కనబడింది. అపహరణకు గురైన వైర్ బాక్సుల విలువ సుమారుగా రూ. 1.50 లక్షకు పైగా ఉంటుదని బాధితుడు పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలో కూడా ఇదే తరహాలో రెండుసార్లు తమ షాపులో దొంగతనం జరిగిందని దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైనట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ఆశ వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలి

తాడేపల్లి రూరల్: వేతనాల పెంపు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల మహాసభను జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మి మాట్లాడుతూ గతంలో అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా ఆశ వర్కర్లకు గ్రాట్యూటీ, వయోపరిమితి, వివిధ రకాల సెలవులు జీవో నెం. 94 ద్వారా సాధించుకున్నామని వివరించారు. ఈనెల 12న చేబ్రోలు పీహెచ్‌సీకి సంబంధించిన ఆశ వర్కర్ ఇంటూరి సులోచన అనారోగ్యంతో మరణించారని, ప్రభుత్వం ఆమె కుటుంబానికి ఉద్యోగం, ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశ వర్కర్ సీనియర్ మండల గౌరవ అధ్యక్షులుగా వేముల దుర్గారావు, డ్రైవర్స్ కాలనీ ఆశ వర్కర్ల అధ్యక్ష, కార్యదర్శులుగా విజయలక్ష్మి, జ్యోతి, కోశాధికారి బేబి, మరో 8 మంది కమిటీగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మండల ఆశ వర్కర్ల యూనియన్ కార్యదర్శి వేముల రేణుక, కరుణకుమారి, బేబీ విజయశ్రీ, వినోదిని తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డికే మద్దతు



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌తో అశోక్‌రెడ్డి

మున్నంగి(తెనాలి): కొల్లిపర మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ ఆరిగ అశోక్‌రెడ్డి నాయకత్వంలో ఏకతాటిపై నడిచేందుకు నిర్ణయించారు. పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో సీనియర్ రాజకీయనేత, కొల్లిపర మాజీ ఎంపీపీ ఆరిగ అశోక్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. కొల్లిపర మండల గ్రామం మున్నంగికి చెందిన ఆరిగ అశోక్‌రెడ్డి గతంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొల్లిపర ఎంపీపీగా చేశారు. తర్వాతికాలంలో వ్యాపార నిమిత్తం ఒంగోలుకు వెళ్లిపోయారు. ప్రస్తుతం తిరిగి సొంతూరు మున్నంగికి వచ్చేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలుసుకున్నారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తానని హామీనిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం అశోక్‌రెడ్డి నివాసంలో శివకుమార్ సమక్షంలో పార్టీ నేతలంతా కలుసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కీలక పదవికి పోటీచేసే ఉద్దేశంతో ఉన్న అశోక్‌రెడ్డికి మండల నాయకులంతా శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకతాటిపై ఆరిగ అశోక్‌రెడ్డి వెంట నడుస్తూ పార్టీకి పునర్వైభవం కోసం కృషిచేస్తామని స్పష్టంచేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డికి మద్దతుగా ఉంటానని పార్టీకోసం పనిచేస్తానని అశోక్‌రెడ్డి చెప్పారు. గ్రామ పెద్దలు ఆరిగ కోటిరెడ్డి, ఉపసర్పంచ్ ఆళ్ల నాగిరెడ్డి, ఆళ్ల శంకరరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, పార్టీ పెద్దలు, మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశంలో పాల్గొన్నారు.